## క్లుప్తంగా

### మంత్రి పెద్దిరెడ్డి పర్యటన రేపు

**కుప్పం :** మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం కుప్పంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయం తెలిపింది. ఐఆర్‌ఆర్‌ఎం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జీఎస్ రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నట్లు పేర్కొంది.

### 7న గృహ సారథుల సమావేశం

**పుంగనూరు :** పురపాలక పరిధిలోని గృహ సారథులతో మంగళవారం పట్టణంలో సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

### సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఆనంద్‌బాబు



ఆనంద్‌బాబును సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

**పలమనేరు :** నియోజకవర్గ సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఆనంద్‌బాబు నియమితులయ్యారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆనంద్‌బాబును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. సంఘం నేతలు హరి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

### తాగునీటి ట్యాంకు ప్రారంభం



నీరు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

**సదుం:** మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ బ బల్లావారిపల్లెలో నిర్మించిన తాగునీటి ట్యాంకును జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప ఆదివారం ప్రారంభించారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కృష్ణారెడ్డి, హరినాథరెడ్డి, దుర్గాప్రసాద్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మానస



**చౌడేపల్లె :** మండలంలోని మర్రిమాకులపల్లె ఉన్నతపాఠశాల విద్యార్థిని మానస రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాదముని తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మానస ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈనెల 14 నుంచి 16 వతేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు వివరించారు. మానసను పీడీ పవన్ కుమార్, సర్పంచ్ షంషీర్‌భాషా, సింగిల్‌విండో డైరెక్టర్ రమేష్ బాబు, చిన్నప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

### రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

**సదుం:** మండలంలోని భట్టువారిపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. పిడిగోవులవారిపల్లెకు చెందిన మునీశ్వర, సురేంద్ర ద్విచక్ర వాహనంలో అర్ధగిరి ఆంజనేయస్వామి ఆలయానికి బయలు దేరారు. మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మునీశ్వరకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో సదుం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సోమేశ్వరుని రథోత్సవం



**కుప్పం :** పట్టణంలోని పాతపేటలో వెలసి సోమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలతో స్వామి వారు రథంపై ఊరేగుతుండగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

### సీతారాముల విగ్రహ ప్రతిష్ట



**చౌడేపల్లె :** మండలంలోని తెల్లనీళ్లపల్లెలోని ఆలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్టను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాలకు అభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

---

## ● ముగిసిన మసెమ్మ జాతర







పుంగనూరు మండలంలోని కురప్పల్లె గ్రామంలో వెలసిన మసెమ్మ జాతర రెండో రోజు ఆదివారంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో జెట్టి కులస్తులు నూతనంగా నిర్మించిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో చేపట్టిన మహాపూర్ణాహుతికి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఫకృద్దీన్‌షరీఫ్, సచివాలయాల కన్వీనర్ చెంగారెడ్డి, జెట్టి సంఘం నేతలు హరిజెట్టి, భాస్కర్‌జెట్టి, లోకేష్‌జెట్టి, హరి, జయరామిరెడ్డి పాల్గొన్నారు. - పుంగనూరు

---

# పల్లెబాట.. ప్రగతికి పెద్దపీట

- 23 రోజులు.. 885 గ్రామాల్లో పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి
- రూ.21.58 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- ఎక్కడికక్కడ ప్రజా సమస్యల పరిష్కారం



రొంపిచెర్లలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**రొంపిచెర్ల :** గ్రామీణాభివృద్ధి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. మొత్తం 23 రోజుల్లో సుమారు 885 గ్రామాల్లో పర్యటించారు. అందులో భాగంగా రొంపిచెర్ల మండలంలో మూడు రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఆదివారం పల్లెబాటకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి ఆయా గ్రామాల ప్రజలు వివిధ సమస్యలను తీసుకువచ్చారు. పక్కా ఇళ్లు, కొత్త పింఛన్లు, రోడ్ల నిర్మాణం తదితరాలపై మంత్రి వెంటనే స్పందించారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కన్నంకాడ దళితవాడలో నిత్యావసర సరుకులను లబ్ధిదారుల ఇంటికే చేర్చాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, సీడీపీఓ రాజమ్మ, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, ఎంఈఓ హసన్‌బాషా, సర్పంచ్‌లు అరుణ, రమణయ్య, సుధారాణి, నాగిరెడ్డి, ఇబ్రహీంఖాన్, ఎంపీటీసీ సభ్యుడు నూలు రెడ్డెప్ప, నాయకులు భాస్కర్‌రెడ్డి, కె.రవీంద్రనాథరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, రవీంద్ర, సూర్య నారాయణ రెడ్డి, రామ నారాయణరెడ్డి , ప్రేమానందం పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం**

పుంగనూరు నియోజకవర్గంలో నిర్వహించిన పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాదాపు రూ. 21.58 కోట్లతో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.8 కోట్లతో నిర్మించిన 20 గ్రామ సచివాలయ భవనాలు, రూ.5.88 కోట్లతో నిర్మించిన 27 రైతు భరోసా కేంద్రాలు, రూ.3.15 కోట్లతో నిర్మించి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రూ.2.55 కోట్లతో నిర్మించిన 30 అంగన్‌వాడీ భవనాలు, రూ.2 కోట్లతో నిర్మించిన 40 వాటర్ ప్లాంట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ టీడీపీ నేతలు

**వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు**

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సొంత పంచాయతీ బొమ్మయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏళ్ల తరబడి టీడీపీకి సేవ చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల వలన రూ.లక్షల లబ్ధి పొందినట్లు వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంచాయతీలో అద్భుతంగా మౌలిక వసతులు కల్పించారని కొనియాడారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కష్ట పడే వారికి ఎప్పుడూ వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లా లక్ష్మీ, డాక్టర్ శ్రీనాథ్, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

### ప్రజాప్రతినిధులతో నేడు సమావేశం

**చౌడేపల్లె :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటకు ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం హాజరుకానున్నట్లు వెల్లడించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

### రవిదాస్‌కు ఘన నివాళి



రవిదాస్ చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న బీజేపీ నేతలు

**పుంగనూరు :** దళిత కవి రవిదాస్ మహరాజ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి స్థానిక బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేంద్రకుమార్ రెడ్డి, మదనమోహన్, అయూబ్‌ఖాన్, విజయ శంకర్, గణేష్, నానబాల లక్ష్మణ్‌కుమార్, నరసింహులు, మురళి, మహేష్ పాల్గొన్నారు.

# సామాజికాభివృద్ధికే సంక్షేమం



లబ్ధిదారుకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం
- అర్హులందరికీ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

**శాంతిపురం :** రాష్ట్రంలో సామాజికాభివృద్ధి కోసం అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిలాఅధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆదివారం చెంగుబళ్ల పంచాయతీ సోగడబళ్లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు అందిస్తున్నారన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని కొనియాడారు. ఇవన్నీ ప్రతిపక్షాలకు కనిపిస్తున్నా, రాజకీయ ప్రయోజనాల కోసం అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయని విమర్శించారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసి కేవలం తమ అడుగులకు మడుగులొత్తే కాంట్రాక్టర్లకు రోడ్లు, బిల్డింగుల పనులు అప్పగించడమే అభివృద్ధి అని కొందరు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. అనారోగ్యంతో ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ సైతం గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలకు ఫలహారమైందని ఆరోపించారు. అప్పట్లో పేదల పేరు చెప్పి రూ.లక్షలు దోచుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీడీపీ నేతలకు సైతం న్యాయం చేస్తున్నామని వెల్లడించారు. అందులో భాగంగానే చెంగుబళ్ల పంచాయతీకి చెందిన టీడీపీ కీలక నాయకుడి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలు అందాయని వివరించారు. ఎలాంటి కష్టమొచ్చినా సీఎం జగనన్న ఉన్నారనే భరోసా ప్రజలకు ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నేతలు చెంగప్ప, కృష్ణమూర్తి, దేవేంద్రప్ప, విజయకుమార్, సర్పంచ్ పూలకుంట భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

**సదుం:** మండలంలోని బూరగమందకు చెందిన రమణారెడ్డి (57) అస్వస్థతతో ఇటీవలే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గణేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భగీరథరెడ్డి పాల్గొన్నారు.

### కోనేటిరాయునికి ఊంజల్‌సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**గంగవరం :** మండలంలోని కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని ఊంజల్‌పై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కనుల పండువగా సేవ జరిపించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ పర్యవేక్షకులు గజేంద్ర పాల్గొన్నారు.

# టీడీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న పీఎస్ నాగరాజు

**వి.కోట :** అభివృద్ధిపై టీడీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు స్పష్టం చేశారు. శనివారం వి.కోటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంకటేగౌడపై టీడీపీ నేతలు చేసిన విమర్శలు అర్థరహితమన్నారు. మండలంలో అభివృద్ధి పరుగులు తీస్తుంటే కనిపించడంలేదా అని ప్రశ్నించారు. సుమారు రూ.61కోట్లతో 3,398 గృహాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కులం, మతం, పార్టీలను చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తుంటే అసత్య ప్రచారాలు చేయడం టీడీపీ నేతలకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఏసీ రూముల్లో కూర్చుని విమర్శించడం కాదని, ఒక్కసారి పాఠశాలలకు వెళ్లి చూస్తే అభివృద్ధి అంటే ఏంటో తెలుస్తుందని వెల్లడించారు. గత టీడీపీ హయాంలో పాఠశాలలను శిథిలావస్థకు చేర్చారని ఆరోపించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల గురునాథ్ పాల్గొన్నారు.

### వేణుగోపాలునికి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

**వి.కోట:** పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుని ఆలయ హ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. పి.రామూర్తి నాయుడు, పి.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పీఎం బసప్ప కుటుంబీకు ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవం సాగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అడుగడుగునా స్వామివారికి మహిళలు హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు. సీఐ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి స్వామివారికి ధూళి ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ పీఎస్ లక్ష్మి, హరినాథ్, గోపీనాథ్, రాజా, రమేష్, ధీరజ్ పాల్గొన్నారు.

# కుంభాభిషేకం.. కల్యాణోత్సవం



సీతారాముల కళ్యాణోత్సవం



హాజరైన భక్తులు

**రామకుప్పం:** మండలంలోని ఉన్సిగానిపల్లెలో ఉన్న ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ కుంభాభిషేకాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారికి ఉత్సవం జరిపించారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని సింగసముద్రంలో సీతారాముల ఆలయంలో నూతన విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు.



గ్రామోత్సవంలో భక్తులు

### కమనీయం.. కల్యాణం

**సదుం:** జంగంపల్లెలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా ఆదిదంపతులకు కల్యాణం జరిపించారు. ఉదయం గ్రామోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

### విశ్వేశ్వర వైభవం



కాశీవిశ్వేశ్వరుని రథోత్సవంలో కళా ప్రదర్శన

**పలమనేరు :** పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీలుగుర్రాలు, బుట్టబొమ్మలు, పండరి భజనలు, మంగళ వాయిద్యాలు, కోలాటలు, నాదస్వర వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో కనులపండువగా ఉత్సవం కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ వీరభద్ర, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# గెలుపే లక్ష్యంగా ముందడుగు



సచివాలయ కన్వీర్లు, గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

**పెద్దపంజాణి :** రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ముందడుగు వేయాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో నియోజకవర్గ పరిశీలకుడు ఖలీల్ అహ్మద్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూరుస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. వీరికి తోడుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు.

ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి నాగరాజును ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ పృథ్వీ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు సుహేబ్, మాకయ్య, తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.